# 24. బ్రిటిష్ సింహంతోక

మధ్య భారతంలోని దేవాస్ సంస్థానాధీశుడు హిజ్ హైనెస్ మహారాజా తిక్కోజీరావు పవార్ చరిత్ర ప్రసిద్ధినందిన ఛత్రపతి శివాజీ వంశీకుల వారసుడు. మరాఠీ భాషలో మంచికవి, చరిత్రలో నిష్ణాతుడు. కొల్హాపూర్ సంస్థానాధీశుల బిడ్డ మహారాణీ అక్కా సాహెద్ ఆయన ధర్మపత్ని. వారిది అన్యోన్య దాంపత్యం. అందువల్లా మహారాజావారి జ్ఞానసంపదవల్లా శ్రీవారు సోదర రాజ వంశాల్లోనే గాక, తను ద్వేషించే బ్రిటిష్ అధికారుల గౌరవాదరాలకు కూడా పాత్రులయ్యారు.

వీలయినన్ని ఎక్కువ సంస్థానాల్ని, తద్వారా వీలయినంత ఎక్కువ భారత భూభాగాన్ని తమ ఆధిపత్యంలోకి తెచ్చుకోవాలనేది ఆ నాటి బ్రిటిష్ వారి పాలసీ.

మహారాజా తిక్కాజీరావు పచ్చి బ్రిటిష్ వ్యతిరేకి, హిజ్ హైనెస్ బిరుదుకు కూడా లొంగని మహారాష్ట్రుడు. ఆయన్ను గద్దె నుండి దింపి మరాటా భూభాగాన్ని కబళించటం ఎలాగనేది బ్రిటిష్ వారికో సమస్య అయిపోయింది. మహారాజావారు సామాన్యులుగారు. ఆయనకే ఆపద వచ్చినా ఆదుకునేందుకు సోదర సంస్థానాధీశులెందరో సిద్ధంగా ఉన్నారు.

ఇదిలా ఉండగా ఓ సుదినాన బ్రిటిష్ వారి బ్రెడ్డు విరిగి ఏకంగా వెన్నలోపడే కథ ఒకటి జరిగిపోయింది.

మహారాజావారు ఓసారి అత్తవారింటికి కొల్హాపూర్ సంస్థానానికి వెళ్ళినపుడు అక్కడ మహారాణి అక్కాసాహెబ్‌కు పరిచర్యలు చేసేందుకు

వినియోగించబడిన ఓ యువతిని చూసి సమ్మోహితులయ్యారు. అంతటితో ఆగక ఆవిడను తనవెంట స్వస్థలానికి తీసుకువచ్చి మహారాజ మందిరంలో విడిది చేయించారు. ఆవిడ మందిరంలో మహారాజా వారు స్వర్గాన్ని రుచిమరగి మహారాణీ వారినే మరచిపోయారు.

సంగతి తెలిసిన మహారాణీ వారు అలిగారు కానీ, అందరిలాగా కోప గృహంలోకి వేంచేయలేదు. సరాసరి పుట్టింటికి కొల్హాపూర్‌కు వెళ్లి పోయేరు.

అక్కడి నుండి మహారాణీ వారు మహారాజా వారిమీద శాంతి యుద్ధం ప్రకటించారు. ఆవిడకు బ్రిటిష్ పోలిటికల్ డిపార్టుమెంటులోని ప్రముఖులంతా సుపరిచితులు. ఈ శాంతి యుద్ధంలో బాగంగా బ్రిటిష్ వారు మహారాజా వారిమీద బాణా లెక్కుపెట్టారు. "మహారాజాధిరాజా, తమరు నేరం చేసారని సాక్షాత్తు మీ మహారాణీ వారే సెలవిస్తున్నారు. తమరేమంటారు? మేం నియమించనున్న విచారణ సంఘం ముందు నిల బడతారా? లేక మర్యాదగా గద్దెదిగి మీ సుపుత్రుడి నందులో అధిరోహింప జేస్తారా?" అని సూటిగా ప్రశ్నిస్తూ బ్రిటిష్ పోలిటికల్ డిపార్టుమెంటు వారు మహారాజా తిక్కోజీరావు పవార్ వారికి శ్రీ ముఖం పంపారు.

మహారాజావారి పని సంకటంలో పడింది. మహారాణీ వారి శక్తి వంతమైన ప్రచార ఫలితంగా సోదర మహారాజులంతా అప్పటికే తనపట్ల ఏవగింపుతో ఉన్నారు. బ్రిటిష్ వారేమో దొరికిందే సందని తనను సింహాసనం నుండి దింపేందుకు కృత నిశ్చయంతో ఉన్నారు. తనకేమో ఇంతచేసిన మహారాణీ అక్కాసాహెబ్‌వల్ల కలిగిన పుత్రుడికి సింహాసనం అప్పగించటం అసలే ఇష్టంలేదు.

అందుకని మహారాజా వారు అర్జంటుగా టెలిగ్రాం ఇచ్చి ఢిల్లీలోని

సుప్రీంకోర్టు న్యాయవాది, తన న్యాయసలహాదారూ అయిన బి. బి. తావక్లేనును పిలిపించి సలహా అడిగారు

వారి మంతనాలు అర్ధరాత్రిదాకా ఆగకుండా జరిగాయి: పర్యవసానంగా మహారాజావారు తెల్లవారగానే తాను తీర్థయాత్రలకు పోనున్నట్లు ప్రకటించారు. తాను రాజధానిలో లేని రోజుల్లో పాలనా వ్యవహారాలు చూసేందుకో మంత్రి మండలిని నియమించారు. తాను ఎక్కడున్నా తనకు ఏ ఇబ్బందీ లేకుండా కావలసిన సమస్తం అందే ఏర్పాట్లు చేయించారు. ఆప్తులైన 200 మంది పరివారంతో తీర్థయాత్రలకు దక్షిణ దేశానికి బయలుదేరారు.

తీర్థయాత్రలకు బయలుదేరారని వినగానే మహారాణీవారు సంతోషించారు, మహారాజావారికి పశ్చాత్తాపం కలిగింది గదా! అని. బ్రిటిష్ వారున్నూ ఎగిరి గంతేసారు, అయ్యవారు దారిలోకి వస్తున్నారుగదా! అని.

కానీ......!

హిజ్ హైనెస్ మహారాజా తిక్కోజీరావు పవార్ వారు అలావెళ్ళి... వెళ్ళి...పాండిచ్చేరిలో ప్రవేశించారు. అక్కడే ఓ దివ్య భవనం చూసుకుని శాశ్వతంగా అందులో కాపురం పెట్టారు. వెంట వచ్చిన పరివారం మధ్య రాజేంద్రుడిలా వెలిగిపోసాగారు. శ్రీవారి ప్రియదూతిక సదరు దివ్యభవనాన్ని మరో చిన్న స్వర్గలోకంగా మార్చివేసింది.

సంగతేమంటే పాండిచ్చేరి ఫ్రెంచి వారి అధీనంలో ఉంది.అక్కడ బ్రిటిష్ వారి పెత్తనంగానీ, జిత్తులుగానీ చెల్లవు. మహారాజావారు ముందే తన న్యాయ సలహాదారు తావక్లేను పాండిచ్చేరి పంపి తన రాజకీయ వానప్రస్థాశ్రమానికి ఫ్రెంచి ప్రభుత్వ ఆమోదం, అభయం పొందిఉన్నారు.

సంగతి తెలిసిన బ్రిటిష్‌వారు చదికిల బడ్డారు. పాండిచ్చేరిలో ఉన్నంతకాలం మహారాజావారిని ఏం చేయటానికీ వీలులేదు. పోనీ సంస్థానాన్ని స్వాధీనం చేసుకుందామా అంటే అక్కడ చట్టబద్ధంగా మహారాజావారు నియమించిన మంత్రివర్గం ఉంది. దానిని కాదనేందుకు చట్టాలు ఒప్పవు.

ఆ విధంగా మహారాజా తిక్కోజిరావు పవార్ బ్రిటిష్ వారిని కాదని, వారికి టోపీకూడా వేసి జీవితాంతం పాండిచ్చేరిలోనే గడిపారు. అక్కడి నుండే తన దేవాస్ సంస్థానాన్ని మంత్రివర్గ సాయంతో పాలించారు.

ఆ విధంగా మహారాజావారు తాను ద్వేషించే బ్రిటిష్ సింహం మీసాలూడబీక లేకపోయినా తోకుచ్చుకు గుంజ గలిగేరు.

★